## క్లుప్తంగా

### మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మహిళలతో మాట్లాడుతున్న విజయకుమార్

చిల్లకూరు: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించిన రోజున దేశం అభివృద్ధి చెందుతుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయకుమార్ తెలిపారు. మండలంలోని బల్లవోలు నుంచి అంకులపాటూరు వరకు సాగిన పాదయాత్రలో ప్రతి గ్రామంలో మహిళలు ఆయనకు స్వాగతం పలికారు. చింతవరంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు రమణయ్య, ఏ పార్వతయ్య, జీ జయరామయ్య, పీ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

### ఓటర్ల జాబితాపై దృష్టి పెట్టండి

చిల్లకూరు: ఓటర్ల జాబితా సిద్ధం చేయడంపై బీఎల్వోలు దృష్టి పెట్టాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని బీఎల్వోలు, రెవెన్యూ సిబ్బందితో తిరుపతి నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ బాలాజీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఓటరు వివరాలు నమోదు చేయాలన్నారు. కొంతమంది బీఎల్వోలు డోర్ నంబర్ లేకుండా ఓటరు నమోదు చేస్తున్నందున ఇబ్బందులు తలెత్తున్నాయని, దీనిపై అన్ని రాజకీయ పార్టీలు అభ్యంతరాలు తెలియజేస్తున్నందున కచ్చితంగా డోర్ నంబర్ వేసేలా చూడాలని సూ చించారు. ఎన్నికల కమిషన్ నిర్ణయించిన సమయానికి ఓటర్ల జబితాల పరిశీలన పూర్తి చేసి అందించేలా చూడాలన్నారు.

### ఆడికృత్తిక వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

వాకాడు(చిట్టమూరు):మల్లాం గ్రామంలో ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేస్వార స్వామి ఆలయంలో ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న ఆడికృత్తిక వేడుకలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ పాలకమండలి చైర్మన్ చిల్లకూరు సాయికుమార్‌రెడ్డి సోమవారం ఆలయంలో మాట్లాడుతూ సుబ్రహ్మణ్యేస్వామి ఆలయంలో ఆడికృత్తిక వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు ఈ వేడుకల్లో పాల్గొనడం జరుగుతుందన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి

గూడూరురూరల్: ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముతవల్లీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముస్లిం నాయకులు సోమవారం ఆర్డీఓ కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆర్డీఓ కిరణ్‌కుమార్ నియోజకవర్గంలోని ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించి మండలాల వారీగా ముస్లింల సమస్యలను తెలుసుకున్నారు. ముతవల్లీ అసోసియేషన్ అధ్యక్షుడు మొబీన్‌బాషా, జిలానీ బాషా, గఫూర్, అమీర్, చాన్‌బాషా, జిలానీబాయ్, సిరాజ్, ఇలియాజ్, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

### అధ్యాపకుడికి డాక్టరేట్



సత్యవేటి పీటర్‌ను అభినందిస్తున్న విజయకుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సత్యవేటి పీటర్‌కు ఇంగ్లిషు సబ్జెక్ట్‌లో విక్రమ సింహపురి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. అల్లీగరైజింగ్ ఎపోలిటిజమ్ ఏ స్టడీ ఆన్ జాన్ మిల్టన్స్ పారడైజ్ లాస్ట్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ పట్టా అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, హెచ్ఓడీ చింతా రవీంద్రారెడ్డి అభినందించారు.

### ఎల్ఈడీ బల్బుల పంపిణీ

ఓజిలి: మండలంలోని భట్లకనుపూరులో గున్నం సేవా ట్రస్టు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేత రవీందర్‌రెడ్డి పంచాయతీలకు ఎల్ఈడీ విద్యుత్ బల్బులను సోమవారం పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కే గోపాల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఖాదర్‌బాషా, వెంకటరమణరాజు, దశయ్య, గోను నారాయణ పాల్గొన్నారు.

### సర్వే త్వరితగతిన పూర్తి చేయండి



బీఎల్ఓలతో సమీక్షిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరురూరల్: ఎస్ఎస్ఆర్ 2024 ప్రకారం ఓటరు జాబితా సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని గూడూరు ఆర్డీఓ ఎం.కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గూడూరులోని వెలుగు కార్యాలయంలో సోమవారం గూడూరు పట్టణ, రూరల్ ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డోర్ టూ డోర్ సర్వే వేగవంతం చేయాలని సూచించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, పేర్లు, ఫొటోలు తదితర సవరణలను ఈనెల 21వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే చేసేటపుడు ఆయా రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్లతో కలసి ఓటరు జాబితా సవరణ సర్వే చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ బాలలీలారాణి తదితరులు పాల్గొన్నారు.

# అమ్మపాలు అమృతం



రాపూరు: మాట్లాడుతున్న సీడీపీఓ సునందన



ఓజిలి: మాట్లాడుతున్న సీడీపీఓ ఉమామహేశ్వరి

రాపూరు: పుట్టిన బిడ్డకు అమ్మపాలు అమృతంతో సమానమని అంగనవాడీ సీడీపీఓ సునందన పేర్కొన్నారు. రాపూరు మండలం వేపినాపి క్లస్టర్ పరిధిలోని పోకురుపల్లెలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు తాగించాలని, డబ్బాపాలు తాగించకుడదన్నారు. బిడ్డకు పాలు ఇవ్వడం తల్లీబిడ్డకు ఆరోగ్యకరమన్నారు. ప్రతి తల్లీ తన బిడ్డకు ముర్రుపాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సౌజన్య పాల్గొన్నారు.

**సంపూర్ణ ఆరోగ్యం**

ఓజిలి: తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరి అన్నారు. సోమవారం మండలంలోని మానమాలలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లిపాలు పడితే వ్యాధినిరోధకశక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజన, కార్యకర్తలు కామేశ్వరమ్మ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

**ఎంతో శ్రేయస్కరం**

గూడూరురూరల్: పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని, రెండేళ్ల వరకు తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని గూడూరు లయన్స్ క్లబ్ ఆఫ్ వైజేపీ అధ్యక్షుడు ఎస్ఎల్ఎన్ స్వామి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ వైజేపీ ఆధ్వర్యంలో సోమవారం బాలింతలు, గర్భిణీలకు పౌష్టికాహారం, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ గురునాథం, ఆర్‌వీ రావు, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ముగిసిన వారోత్సవాలు**

చిల్లకూరు: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో వారం రోజులుగా నిర్వహిస్తున్న తల్లి పాల వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని తిక్కవరం ఎస్టీ కాలనీ, గుమ్మళ్లదిబ్బలోని మత్స్యకారకాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల ముగింపు సమావేశాలు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఓడూరు సతీష్‌రెడ్డి, నెల్లిపూడి సుబ్రహ్మణ్యం పాల్గొని, మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేసే పౌష్టికాహారాన్ని క్రమం తప్పక తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ మహబూబి మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు టీకా లాంటివన్నారు. అనంతరం వారికి పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు నాగెశెట్టి రేణుక, శివజ్యోతి పాల్గొన్నారు.

**బిడ్డకు శ్రీరామ రక్ష**

వాకాడు: తల్లి పాలే బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కవిత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని నిడిగుర్తి సెక్టార్ రావిగుంటపాళెంలో తల్లి పాల విశిష్టతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తల్లులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ సిబ్బంది కె పద్మ, వాసంతి, టి వసంతమ్మ, డి ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారం అందజేస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు



చిల్లకూరు: తిక్కవరంలో మాట్లాడుతున్న సర్పంచ్



వాకాడు: మాట్లాడుతున్న సూపర్ వైజర్ కవిత

## స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ

గూడూరురూరల్: స్పందన కార్యక్రమంలో ప్రజలు అందించిన అర్జీలకు సంబంధించి సత్వర పరిష్కారం అందించాలని ఆర్డీఓ ఎం.కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం గూడూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ కిరణ్‌కుమార్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. గూడూరు డివిజన్‌లోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు సమస్యలపై అర్జీలను అందజేశారు. గూడూరు ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎలాంటి అనుమతులు లేకుండా దశాబ్దాల నాటి చెట్లను కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది కలిసి నరికి వేసి అమ్ముకున్నారని, వారిపై చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, శివకుమార్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్ ఆర్డీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆర్డీఓ కిరణ్‌కుమార్ గూడూరు తహసీల్దార్ లీలారాణిని విచారణకు ఆదేశించారు. అలాగే గూడూరు ప్రభుత్వాస్పత్రిలో సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని, రోగులకు సరైన వైద్యం అందడం లేదని ఎమ్మార్పీఎస్ నాయకులు పెంచలయ్య, రవికుమార్, శ్రీనివాసులు ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు.

## అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న జైభీమ్ సేవాసమితి సభ్యులు

చిల్లకూరు: మండలంలోని తిక్కవరం దళితవాడకు వెళ్లే మార్గంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సోమవారం జైభీమ్ సేవా సమితి నిర్వాహకులు భూమిపూజ చేశారు. తిక్కవరం రహదారి పక్కనే బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా ప్రయత్నిస్తున్నప్పటికీ అనుకూలమైన పరిస్థితి లేక వాయిదా వేస్తూ వస్తున్నామని ప్రస్తుతం జై బీమ్ సంస్థ నిర్వాహకులు తమకు తోడ్పాటు ఇవ్వడంతో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు జె మస్తానయ్య, కార్యదర్శి రత్నాకర్, రామయ్య, వాలి శివప్రసాద్, భాస్కరయ్య, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

## బైక్ బోల్తా..వ్యక్తి మృతి



చెంచుకృష్ణయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

నాయుడుపేటటౌన్: మండలంలోని అన్నమేడు జాతీయ రహదారి కూడలి వద్ద సోమవారం స్వర్ణముఖి నది బ్రిడ్జిపై నుంచి నదిలోకి బైక్ బోల్తా పడింది. ఈ ఘటనలో పోన్నూరు చెంచు కృష్ణయ్య(22) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు కథనం మేరకు.. సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరు గ్రామానికి చెందిన చెంచుకృష్ణయ్య ఇంటి నుంచి కాపులూరులోని బంధువుల ఇంటికి బైక్‌లో బయలుదేరాడు. మార్గం మధ్యలో అన్నమేడు జాతీయ రహదారి కూడలి వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి స్వర్ణముఖి నది బ్రిడ్జి గోడను ఢీకొని బైక్‌తో పాటు బ్రిడ్జిపై నుంచి నదిలో రాళ్లపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ కృష్ణయ్య సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి తల్లి కృష్ణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు నోటిఫికేషన్

గూడూరురూరల్:డివిజన్‌లోని 7 మండలాల్లో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు సోమవారం రాత్రి గూడూరు ఆర్డీఓ ఎం.కిరణ్‌కుమార్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆర్డీఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వెంకటగిరి మండలం పాలెంకోట పంచాయతీ సర్పంచ్, గూడూరు మండలం తిమ్మసముద్రం పంచాయతీ ఉపసర్పంచ్‌తోపాటు కోట మండలం ఉత్తమ నెల్లూరు, కేశవరం, డక్కిలి మండలం శ్రీపురం, దండవోలు, ఆల్తూరుపాడు, చిల్లకూరు మండలం చేడిమాల, వాకాడు మండలం కొండాపురం, చిట్టమూరు మండలం మెట్టు గ్రామాల్లో వార్డు సభ్యుల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. మంగళవారం నుంచి ఈనెల 10వ తేదీ 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరణ జరుగుతుందన్నారు. 11న స్క్రూటినీ, 12న స్క్రూటినీపై అభ్యంతరాలు, 14వ తేదీ 3 గంటలకు విత్‌డ్రా, అదే రోజున పోటీలో ఉండే అభ్యర్థుల జాబితా ప్రకటన, 19న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరిపి, విజేతలను ప్రకటిస్తామని చెప్పారు. ఎక్కడైనా రీపోలింగ్‌కు అవకాశం ఉంటే ఈనెల 20వ తేదీన జరుపుతామన్నారు.

## నేతన్న నేస్తంతో చేనేత జీవితాల్లో వెలుగు



పెళ్లకూరులో చేనేత కార్మికులకు సన్మానం

పెళ్లకూరు: నేతన్న నేస్తం పథకంతో చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ శేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం పెళ్లకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ భారతీయ చేనేతలో గొప్పతనం, భిన్నత్వం, అందాలకు ప్రపంచ స్థాయిలో మంచి గుర్తింపు ఉందన్నారు. చేనేత సీనియర్ కార్మికులను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులకు 'సెలబ్రేటింగ్ ఇండియన్ హ్యాండ్ లూమ్స్ వీవింగ్ అవర్ కల్చరల్ హెరిటేజ్' అనే అంశంపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్‌బాబు, ఎంఈఓ శంకరయ్య, నాయకులు వెంకటరత్నం, మునిరాజ పాల్గొన్నారు.

**ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం**

గూడూరురూరల్: మండలంలోని విందూరులో సోమవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకట నాగమల్లికార్జున ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పౌరశాస్త్ర అధ్యాపకులు ప్రవీణ్‌గురు, తెలుగు అధ్యాపకులు బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

### కామిరెడ్డికి సన్మానం



సత్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

పెళ్లకూరు: ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సోమవారం ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని చిల్లకూరులోని ఆయన నివాసంలో కలిసి సన్మానించి, అభినందనలు తెలిపారు. సత్యనారాయణరెడ్డి ఎన్‌డీసీసీబీ చైర్మన్‌గా రైతులకు అందించి సేవలతో రాష్ట్రస్థాయి ఆప్కాబ్ అవార్డును సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతులు మీదుగా అందుకోవడం సంతోషకరమన్నారు.

### మెనూ పాటించాలి

పెళ్లకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో కచ్చితంగా మెనూ పాటించాలని ఎంపీడీఓ సురేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన పెళ్లకూరు జెడ్పీ హైస్కూలును తనిఖీ చేసి మధ్యాహ్న భోజన నిర్వహణపై ఆరా తీశారు. రోజు క్రమం తప్పకుండా మెనూ అమలు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

### బీఎల్ఓలతో సమావేశం

ఓజిలి: మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్ఓలతో తహసీల్దార్ శివరామసుబ్బయ్య సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను పక్కా నమోదు చేయాలన్నారు. ఆయన వెంట డీటీ సాయిప్రియాంక ఉన్నారు.

### విద్యార్థుల సంఖ్య పెంచాలి

రాపూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఎంఈఓ శ్రీనివాసులు సూచించారు. ఎమ్మార్సీలో సోమవారం ఎంటీఎస్ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని పెద్దలతో సత్‌సంబంధాలు ఏర్పరచుకుని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు వచ్చేలా కృషి చేయాలన్నారు.

### భూసమస్యల వెల్లువ

దొరవారిసత్రం: రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో పలు గ్రామాల నుంచి భూ సమస్యలపై తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డికి వినతులు వెల్లువెత్తాయి. ఏకొల్లు గ్రామ రెవెన్యూ పరిధిలో సీజేఎఫ్ఎస్ భూములు, ప్రభుత్వ భూమిని కొందరు భూస్వాములు ఆక్రమించి సాగుకు సిద్ధం చేశారని తెలిపారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, ఆక్రమణలు తొలగిస్తామని చెప్పారు.

### సన్మానం



ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

డక్కిలి: మండలంలోని వెంకటేశ్వరపురం ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ బదిలీ అయిన ఝాన్సీలక్ష్మీబాయిని సోమవారం ఆ పాఠశాల సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. హెచ్ఎం పెంచలయ్య మాట్లాడుతూ లక్ష్మీబాయి సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు తేజోవర్మ, అంగనవాడీ కార్యకర్త ధనలక్ష్మి, పీసీ చైర్మన్ సునీత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారంజక పాలనకు బ్రహ్మరథం



కలువాయిలో మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

కలువాయి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న ప్రజారంజక పాలనకు జనం బ్రహ్మరథం పడుతున్నారని, వారి చల్లని దీవెనలతో 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరోసారి అధికారంలోకి వస్తుందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కలువాయి సచివాలయం -2 పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేశారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో ఇంటింటా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వెలుగులు కనిపిస్తున్నాయని, ప్రజల్లో ఆ సంతోషం, సంతృప్తి ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు బి.అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి, సర్పంచ్ డి.పెంచలమ్మ, పీఏసీఎస్ చైర్మన్ సీ సుబ్బరామిరెడ్డి, పార్టీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, నాయకులు ఎం వెంకటనరసారెడ్డి, జీ రమణయ్య, షేక్ జిలానీ, ఓబులేసు పాల్గొన్నారు.

## జగనన్న లేఅవుట్‌లు వేగవంతం



మాట్లాడుతున్న ఎంపీపీ పెంచలమ్మ

సైదాపురం: మండలంలోని సైదాపురం, చీకవోలు గ్రామాల్లో వేసిన జగనన్న లేఅవుట్ల పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు హౌసింగ్ ఏఈ భాస్కర్‌రావు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ పలుగొటి పెంచలమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో 800 పక్కా గృహాలను నిర్మించుకునేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు. ఏఓ హైమావతి మాట్లాడుతూ మండలంలోని 6,669 మంది రైతులు రైతు భరోసా పథకానికి అర్హులుగా గుర్తించామన్నారు. ఎంపీపీ పెంచలమ్మ మాట్లాడుతూ అధికారులందరూ మండల సమావేశానికి విధిగా హాజరుకావాలన్నారు. వైస్ ఎంపీపీ భాస్కర్ మాట్లాడుతూ ఊటుకూరు అంగన్‌వాడీ-2లో రెండేళ్లగా ఆయా విధులకు డుమ్మా కొడుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పోలయ్య మాట్లాడుతూ సైదాపురం పీహెచ్‌సీ పరిస్థితి దారుణంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏఓ శివకుమార్, వైస్ ఎంపీపీ ఈశ్వరమ్మ, ఎంఈఓ దయాకర్, పీ ఈశ్వరరాజు, ఎంపీటీసీ సభ్యులు కే రమణమ్మ , సుమతి, ఎస్ పద్మమ్మ, నాగరాజు, సర్పంచ్‌లు జనార్దన్‌రాజు, సురేష్ పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ నేతలపై జనసేన నాయకుల దాడి





గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకులు

సైదాపురం: మండలంలోని రాగనరామాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలపై అదే గ్రామానికి చెందిన జనసేన నాయకులతోపాటు పలువురు మహిళలు సోమవారం సాయంత్రం దాడి చేశారు. ఈ ఘటనలో వైఎస్సార్‌సీపీ నేతలు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు కథనం మేరకు.. రాగనరామాపురం రెండు గ్రూపులు ఉన్నాయి. ఈ క్రమంలో గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు మల్లిశెట్టి కొండయ్య, నరసింహులు గ్రామానికి వెళుతుండగా అదే గ్రామానికి చెందిన జనసేన నాయకులు ప్రసన్నకుమార్, డీ భరత్, డీ విష్ణుతోపాటు వారి బంధువులైన పలువురు మహిళలు వారిని అడ్డగించి, కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీ నేతలు మల్లిశెట్టి కొండయ్య, నరసింహులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## నేటి నుంచి నామినేషన్

నాయుడుపేట: మండలంలోని గొట్టిప్రోలు పంచాయతీ మూడో వార్డు ఉప ఎన్నికలకు మంగళవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాటిపత్రి పొండయ్య మృతి చెందడంతో ఆ స్థానంలో ఉప ఎన్నిక నిర్వహించన్నారన్నారు. ఉదయం 10.30 నుంచి సాయింత్రం 5 గంటల వరకు నామినేషన్ పత్రాలను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.ఈ ప్రక్రియ గురువారం సాయంత్రం వరకు కొనసాగుతుందన్నారు. ఎన్నికల అధికారిగా కె సుమన్ పర్యవేక్షణలో ప్రక్రియ కొనసాగుతుందని, 11న పరిశీలన, 12న నామినేషన్‌ల తిరస్కరణపై ఆర్డీఓకు అప్పీలు, 13న తిరస్కరణపై పరిష్కారం, 14న సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల విరమణ ఉంటుందన్నారు. ఈ నెల 19వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్, 2 గంటలకు కౌంటింగ్, అనంతరం ఫలితాలు వెలువడనున్నాయని పేర్కొన్నారు.

## చోరీ కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న డీఎస్పీ

కోట: మోటార్‌బైక్‌ల చోరీ కేసులో నిందితుడిని సోమవారం కోట పోలీసులు అరెస్టు చేసినట్లు గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ వివరాలను కోట పోలీస్‌స్టేషన్‌లో ఆయన వెల్లడించారు. నెల్లూరుజిల్లా కొడవలూరు మండలం గండవరం గ్రామానికి చెందిన చీపినాపి మల్లికార్జున్ అలియాస్ వెంకటేశ్వర్లు చెడువ్యవసరాలకు బానిసై డబ్బు సంపాదన కోసం చోరీలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో మోటార్‌బైక్‌లు, తాళాలు వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. చోరీలపై విచారణ జరిపి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా మోటార్‌బైక్‌ల చోరీల విషయం బయటపడింది. నిందితుడి నుంచి 12 మోటార్‌బైక్‌లు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

## లైంగికదాడికి యత్నంపై ఫిర్యాదు

చిల్లకూరు: మండలంలోని నాంచారమ్మపేటలో ఓ మహిళపై ఓ వ్యక్తి లైంగిక దాడికి యత్నించాడని సోమ వారం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. నాంచారమ్మపేట గ్రామానికి చెందిన ఓ మహిళ సమీపంలోని పొలాల్లో పశువులు మేపుకుంటుండగా అదే గ్రామానికి చెందిన షేక్ ఫయాజ్ అనే వ్యక్తి ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. ఈ విషయమై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## కాళంగినదిలో గుర్తు తెలియని శవం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయం సమీపంలో ఉన్న కాళందినదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని స్థానికులు ఆదివారం గుర్తించారు. నదిలో శవం తేలియాడుతుండడంతో స్థానికులు ఈ విషయమై పోలీసులకు సమాచారం అందజేశారు. ఇన్‌చార్జి ఎస్ఐ మనోజ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. బ్లాక్ బ్లూ చెక్స్ షర్టు ధరించి ఉన్నాడు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## గద్దర్ మృతి బాధాకరం



గద్దరన్నకు నివాళులర్పిస్తున్న బహుజన నేతలు

సూళ్లూరుపేట: ప్రజాగాయకుడు డాక్టర్ గద్దర్ మృతి బాధాకరమని, ఆయన లేడన్న నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని ఏడీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యరబోతు సుబ్రమణ్యం అన్నారు. సోమవారం సూళ్లూరుపేట బస్టాండ్‌సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సాయుధ పోరాటంతో ప్రజలకు విముక్తి కల్పించాలనే ఉద్దేశంతో ఆయన ముందు తుపాకీ పట్టి నక్సల్స్ ఉద్యమంలో పని చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రసాధనలో ఆయన పాత్ర కూడా మరువలేనిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో బహుజన నేతల ఆవుల ప్రసాదరావు, కుదిరిగోపీ, ఏ చంద్రయ్య, బీ మనోహర్, రమణయ్య, నాగరాజు, లక్ష్మయ్య, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పదస్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ బ్రహ్మనాయుడు

గూడూరురూరల్: రూరల్ పరిధిలోని పోటుపాళెం సమీపంలోని బ్రిడ్జి వద్ద సోమవారం రాత్రి సుమారు 40 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండడాన్ని గుర్తించినట్లు రూరల్ ఎస్ఐ బ్రహ్మనాయుడు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు నార్త్ ఇండియాకు చెందిన వ్యక్తిగా ఉంటాడని, ఏదైనా పరిశ్రమలో పనికి వచ్చి ఉంటాడని భావిస్తున్నారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.